"చూశావా! నీ స్నేహితురాలు అర్పితనించి విడాకులు రావడం వెరీ సింపుల్ అంటే నమ్మలేదు నువ్వు"

# మూడో అలక

అరగంట ఆలస్యంగా వచ్చినందుకు ఆఫీసర్ చేత పావుగంటసేపు చివాట్లు తిన్నది అలక.

ఆమె పేరు అలక. కానీ పేరుకి విరుద్ధంగా అలక ఎంతో శాంత స్వభావురాలు జీవితంలో రెండుసార్లే అలక అలిగింది. అదీ చిన్నప్పుడు. పెళ్ళయ్యాక అలక భర్త అమర్ సరదాగా నయినా అలకకి కోపంతెప్పించ లేకపోయాడు.

ఆమె కోపం తెచ్చుకోదని అలక ఆఫీసర్ కూడా ఆమెని తిట్టడంలో వెనుకాడడు. తిట్లన్నీ తిన్నాక అలక శాంతంగా. "బస్ పెర్ పంచరయింది. వేరేబస్ దొరకటం లేటయ్యింది" ఎక్స్ప్లనేషన్ బుద్ధిగా శాంతంగా చెప్పింది. అటెండెన్స్ రిజిష్టర్ లో సంతకం చేసి తన సీట్లోకి వెళ్ళి కూర్చుని ఏం జరగనట్లు పని చేసుకోసాగింది.

లంచ్ నించి రాగానే ఆఫీసర్ ఆమెని పిలిచి చెప్పాడు.

"ఐయామ్ సారీ అలక! మీ పక్కింటావిడ ఇందాక ఫోన్ చేసింది మీ ఇంట్లో గేస్‌స్టవ్ అర్పడం మర్చిపోయావట వంటగదిలోంచి మంటలు వస్తున్నాయని, త్వరగా రమ్మని చెప్పింది త్వరగా వెళ్ళమ్మా."

"అరెరె!" అని మాత్రం అంది అలక.

అలక కోలీగ్ ఒకాయనకి స్కూటర్ వుంది. ఆఫీసర్ అతన్ని పిలిచి సంగతి చెప్పి, అలకని వాళ్ళింటికి స్కూటర్ మీద తీసుకెళ్ళమని చెప్పాడు.

స్కూటర్ మీద ఇద్దరూ పదినిమిషాలలో అలక ఇంటికి చేరుకున్నారు. బయట తాళం కప్పలేదు. ఆమె భృకుటి ముడిపడింది. భర్త తనతోనే ఆఫీసుకి వెళ్లాడు మరి తాళం కప్ప ఎవరు తెరిచినట్లు?

తలుపు తోసింది కాని తెరుచుకోలేదు. లోపల గడియ వేసుకున్నారెవరో. అలక కోలీగ్ కాలింగ్ బెల్ నొక్కాడు.

"ఎవరు?" తన భర్త గొంతు వినిపించడంతో అలకలోని టెన్షన్ తగ్గింది. ఆయనకి సంగతి తెలిసి వచ్చి నిప్పు ఆర్పాలనుకుంది అలక.

"తలుపు తీయండి" అలక కోలీగ్ చెప్పాడు.

తలుపు తెరిచి లుంగీలోవున్న అమర్ అలకని చూసి వులిక్కిపడ్డాడు.

"మీకూ ఫోన్ చేసిందా పక్కింటి పిన్నిగారు। నిప్పు యెలా అంటుకుంది....?"

వంటగదిలోకి వెళుతూ, పడక గదిలో తమ మంచం మీద నగ్నంగా దుప్పటికింద పడుకుని వున్న పక్కింటి పిన్నిగారిని చూసి నిర్ఘాంతపోయింది అలక.

"ఒకోసారి సరదాగా ఆడే అబద్దం ఇలా మేలు చేసుందని తెలీదు. నిన్న ఏప్రిల్ ఫస్టుకాబట్టి నిన్ను ఫూల్‌ని చేద్దామని మీ పక్కింటి పిన్నిగారు ఫోన్ చేసిందని సరదాగా అబద్ధం ఆడానంతే" మర్నాడు విడాకుల కోసం కోపంగా లాయర్ దగ్గరకెళ్లి వచ్చిన అలకతో ఆమె ఆఫీసర్ చెప్పారు సంగతి తెలుసుకొని.

# మొందటి భర్త

హైదరాబాద్‌లో ఓ మంచి లొకాలిటీ అది. అక్కడ ఏడంతస్తుల అపార్టుమెంట్స్ ఒకటి అప్పుడే పూర్తయింది. అంతస్తుకి అయిదు చొప్పున మొత్తం ముప్పయి అయిదు ఫ్లాట్స్ వున్నాయి. వాటిని ముందరే బుక్ చేసుకున్న ముప్పయి అయిదుమంది ప్రమోటర్స్ ఒక్కొక్కరే తమ ఫ్లాట్స్‌లోకి మారే రోజులవి.